www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
13.04.2024
సంపుటి:2 సంచిక: 182

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



2లో

## రానున్న మూడు రోజుల్లో వర్షాలు
**ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం**



### ఫోన్ ట్యాపింగ్ కేసులో
# లై డిటెక్టర్‌కు నేను రెడీ

- రేవంత్, కిషన్ రెడ్డి ముందుకు రావాలి
- రేవంత్‌కు దమ్ముంటే మల్కాజ్ గిరికి రావాలి
- అక్కడ తేల్చుకుందాం
- ఫోన్ ట్యాపింగ్ పై మీడియా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను లై డిటెక్టర్ విచారణకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన టీవీ9 లైవ్ షో కార్యక్రమంలో కేటీఆర్ పేర్కొన్నారు.'100 రోజుల పాలనపై లోక్ సభ ఎన్నికలు రెఫరెండం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని 17 స్థానాల్లో మల్లయుద్ధాలు ఎందుకు.. మల్కాజిగిరి సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన సీటు.. అందుకే మల్కాజిగిరికి రమ్మనండి.. ఒక్కసీటులో ఎవరి సత్తా ఏమిటో తేల్చుకుందాం..దీని మీద మేం డిమాండ్ చేస్తే సీఎం రేవంత్ రెడ్డి నోరు మెదపడం లేదు' అని చెప్పారు. 'ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ట్యాపింగ్ జరిగిందా.. లేదా.. అన్నది కోర్టులు తేల్చాలి. నేను ఏ తప్పు చేయలేదు.. చేస్తే ఎవరైనా శిక్షార్హుడే..కానీ మీడియాలో ట్రయల్ జరుగుతున్నది ఇది తప్పు. యూట్యూబ్ ల్లో ప్రచారం వాంచనీయం కాదు. ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పుదోవ పట్టించడానికే ఈ ప్రచారం అంతా.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడం వల్ల ప్రజలకు నష్టం జరుగుతున్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# తక్కువకు కొంటే లైసెన్సులు రద్దు

- మిల్లర్లు, ట్రేడర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక
- రైతులను ముంచితే తాట తీస్తాం.. ఎంతవారైనా ఊరుకోం
- వాళ్ళ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశం
- హైదరాబాద్ లో తాగునీటికి ఢోకా లేకుండా చర్యలు
- సరఫరాకు ఆటంకం కల్పించిన అధికారులను తొలగించాలని సూచన



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రైతులు అమ్ముకునే ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటే, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు ధాన్యం కొనే మిల్లర్లు, ట్రేడర్ల ట్రేడ్ లైసెన్సులు రద్దు చెయ్యాలనీ, కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీఎం ఆదేశించారు. సీఎంతో పాటు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిసి, తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై సమీక్షించారు.

కొన్నిచోట్ల తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందనీ, అందుకే ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని ముఖ్యమంత్రి రైతులకు విజ్ఞప్తి చేశారు. నేరుగా కళ్లాల నుంచి వడ్లను మార్కెట్లకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటుందనీ.. ఒకటి రెండు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి రేటు పొందాలని సీఎం సూచించారు. ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుల్లోనే తగిన ఏర్పాట్లు చేయాలనీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వడ్ల దొంగతనం జరుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలనీ, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

### కొనుగోళ్ల తీరుపై ఆరా

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఏ రోజుకారోజు రాష్ట్ర స్థాయి నుంచి పర్యవేక్షించాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు ఆయా జిల్లాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించాలని సూచించారు. తాగునీటి సరఫరాకు ఉమ్మడి జిల్లాలకు నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని సీఎం సూచించారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల టైమ్ కావటంతో కొన్ని చోట్ల రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు తప్పుడు ఫిర్యాదులు, ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. అటువంటి వాటిపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సీఎం ఆదేశించారు.

### రెండు నెలలు కీలకం

రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా రాబోయే రెండు నెలలు మరింత కీలకమని సీఎం అప్రమత్తం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవటం లేదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అప్పటి కంటే భూగర్భ జల మట్టం పడిపోవటంతో ప్రజలు కేవలం నల్లా నీటిపైనే ఆధారపడటంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ఫిర్యాదు వచ్చినా వెంటనే అక్కడ తాగునీటి సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు. ఏ రోజుకారోజు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారధ్యంలో మిషన్ భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై సమీక్ష జరపాలని సూచించారు.

### తాగునీరు అందిస్తాం..

ఉమ్మడి జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు తాగునీటి ఇబ్బందులున్న చోటికి స్వయంగా వెళ్లి పరిశీలించాలని, అక్కడ సమస్యను పరిష్కరించే చర్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. హైదరాబాద్లో తాగునీటి సరఫరాకు ఢోకా లేకుండా, మరింత డిమాండ్ పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు.అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని హైదరాబాద్కు తెచ్చుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు వెంటనే చేయాలని ఆదేశించారు. ఇటు సింగూర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. కృష్ణా బేసిన్లో నీటి లభ్యత లేనందున ఎగువన నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సీఎం అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ఇటీవల సిబ్బంది అత్యుత్సాహంతో ఒకచోట తాగునీటి సరఫరా నిలిచి పోయిందనే విషయం సీఎం దృష్టికి వచ్చింది. ఉద్దేశ పూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కల్పించిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. అకారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అటువంటి ఉద్యోగులపై ఉదాసీనంగా వ్యవహరిస్తే, అధికారులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా
# సుధీర్ కుమార్

- మొత్తం 17 స్థానాలకు అభ్యర్థులు ఫిక్స్
- రాజయ్యకు బ్యాడ్ లక్
- ఆయనకే టికెట్ ఇవ్వబోతున్నారంటూ జోరుగా ప్రచారం
- చివరినిమిషంలో హ్యాండ్



వివరాలు 2లో

## 19న కిషన్ రెడ్డి నామినేషన్ దాఖలు

- 18న తెలంగాణకు రాజ్ నాథ్ సింగ్
- హాజరు కానున్న కేంద్ర మంత్రి
- ఈనెల 21న మధ్యప్రదేశ్ సీఎం



**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఈనెల 19వ తేదీన సికింద్రాబాద్ లోక్ సభ అభ్యర్థిగా తన నామినేషన్ ను దాఖలు చేయనున్నారు. ఈనేపథ్యంలో ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలంగాణకు రానున్నారు. కాగా రాజ్ నాథ్ సింగ్ ఒకరోజు ముందుగానే అంటే 18వ తేదీ సాయంత్రం హైదరాబాద్ కు చేరుకోనున్నారు. ఆరోజు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొంటారు. మరుసటి రోజు కిషన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతారు. ఇదిలా ఉండగా ఈనెల 21 న రాష్ట్రానికి మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ తెలంగాణకు వస్తున్నారు. మెదక్, సికింద్రబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో యాదవ సంఘాలతో నిర్వహించనున్న సమావేశానికి మోహన్ యాదవ్ హాజరుకానున్నారు. సామాజిక వర్గాల వారీగా ఓటర్లను బీజేపీ వైపునకు ఆకర్షితులను చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 15వ తేదీన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి రైతు దీక్ష చేపట్టనున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే డిమాండ్ తో ప్రశ్నిస్తున్న తెలంగాణ రైతు పేరుతో దీక్షను చేపట్టనున్నారు.

# మాదిగలకు తీవ్ర అన్యాయం

- అణగదొక్కుతున్న కాంగ్రెస్ పార్టీ
- మోత్కుపల్లికి అపాయింట్‌మెంట్ ఇవ్వరా?
- బాబూ జగ్జీవన్ రామ్ జయంతికి దామోదరను ఎందుకు ఆహ్వానించలేదు
- కేబినెట్ లో మైనార్టీలకు చోటు లేకపోయినా షబ్బీర్ స్పందించరా?
- ఆయన ఉన్నది పొగడటానికేనా?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మందకృష్ణ ఫైర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ తీరుపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఫైర్ అయ్యారు. మిగతా 2లో

# సీబీఐ కస్టడీకి కవిత



- ప్రతి రోజు న్యాయవాదులు, కుటుంబసభ్యులను కలిసేందుకు పర్మిషన్
- కవితను కస్టడీకి ఇవ్వొద్దని ఆమె తరపు లాయర్ల వాదన
- తోసి పుచ్చిన న్యాయస్థానం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆమెను 3 రోజుల సీబీఐ కస్టడీకి అనుమతిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ నెల 15 వరకూ ఆమెకు సీబీఐ కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకూ కుటుంబ సభ్యులు, న్యాయవాదులను కలిసేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు కవితను కోర్టులో హాజరు పరచాలని న్యాయమూర్తి సీబీఐను ఆదేశించారు. దీంతో ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న కవితను సీబీఐ తన కస్టడీలోకి తీసుకుని విచారించనుంది. ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి ఈడీ కేసులో తీహార్ జైలులో ఉన్న కవితను గురువారం సీబీఐ అరెస్ట్ చేసింది. ఆమెను శుక్రవారం ఉదయం రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ అధికారులు హాజరుపరిచారు. లిక్కర్ కేసుకు సంబంధించి ఆమెను విచారించాల్సిన అవసరం ఉందని.. 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని .. సీబీఐ న్యాయస్థానాన్ని కోరింది. ఢిల్లీ లిక్కర్ పాలసీలో కవిత కీలక సూత్రధారి, పాత్రధారి అని.. విచారణకు ఆమె సహకరించడం లేదని.. అందుకే కస్టడీకి ఇవ్వాలని కోరింది. దీనిపై విచారించిన న్యాయస్థానం ఆమెను 3 రోజుల సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### పిటిషన్లు తోసిపుచ్చిన న్యాయస్థానం

అంతకు ముందు కవిత దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు తోసిపుచ్చింది. సీబీఐ తనను ప్రశ్నించడాన్ని, అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ కవిత పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే సీబీఐ తనను ప్రశ్నించిందని.. అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడుగుతోందని కవిత తెలిపారు. తనను కస్టడీకి ఇవ్వొద్దని కోరారు. అయితే, సీబీఐ వాదనలతో ఏకీభవించిన కోర్టు ఆమెను కస్టడీకి అనుమతించింది. కాగా, ఢిల్లీ లిక్కర్ కేసులో మార్చి 15న ఈడీ అధికారులు హైదరాబాద్‌లో కవితను అరెస్ట్ చేశారు. ఆమె కస్టడీని ఇప్పటికే మూడు సార్లు పొడిగించింది కోర్టు. కవిత రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 16న విచారణ జరగనుంది. ఈ క్రమంలో కవితను సీబీఐ అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. కోర్టు తీర్పుతో కవితను సీబీఐ అధికారులు కేంద్ర కార్యాలయానికి తరలించనున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించి పలు అంశాలపై ప్రశ్నించనున్నారు.



## రాజ్యాంగాన్ని
# అంబేద్కర్ కూడా మార్చలేరు

- మేం రాజ్యాంగాన్ని గౌరవిస్తాం
- దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ సపోర్ట్
- దేశాన్ని బలహీనపరిచేందుకు ఇండియా కూటమి యత్నం
- రాజస్థాన్ సభలో ప్రధాని మోడీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలపై ప్రధాని మోదీ మరోసారి స్పందించారు. తమ ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని, బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా ఇప్పుడు దాన్ని రద్దు చేయలేరన్నారు. రాజస్థాన్‌లోని బార్మర్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన.. దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ అండగా నిలుస్తోందన్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు విపక్షాల కూటమి 'ఇండియా' ప్రయత్నిస్తోందంటూ దుయ్యబట్టారు. 'తమ ప్రభుత్వానికి రాజ్యాంగమే సర్వస్వం. ఇప్పుడు బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా వచ్చినా రాజ్యాంగాన్ని రద్దు చేయలేరు. దేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేసే ప్రయత్నం కాంగ్రెస్ చేసింది. ఇప్పుడు అదే పేరుతో మోదీపై దుర్భాషలాడుతోంది' అని కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. అణు నిరాయుధీకరణ గురించి విపక్షాలు మాట్లాడటం శోచనీయమన్నారు. పొరుగున అణ్వాయుధాలు కలిగిన దేశాలు ఉండగా.. వీటి నిర్మూలన గురించి మాట్లాడుతారా? అంటూ ప్రశ్నించారు. మిగతా 2లో

# రానున్న మూడు రోజుల్లో వర్షాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో రాగల మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శుక్రవారం ఉరుముల, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ద్రోణి/గాలి విచ్ఛిన్నతి ఒకటి సౌరాష్ట్ర కచ్ వద్ద వున్న ఉపరితల ఆవర్తనం నుంచి మధ్య మహారాష్ట్ర, ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ. ఎత్తులో కొనసాగుతున్నదని పేర్కొన్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం మరాత్వాడా పరిసరాల మధ్య మహారాష్ట్ర ప్రాంతాల వద్ద సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ ఎత్తులో కేంద్రీకృతమై ఉన్న ఆవర్తనం ఇవాళ బలహీన పడిందని వెల్లడించింది.

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. అన్ని జిల్లాల్లో 40 డిగ్రీలలోపే నమోదవుతున్నాయని తెలిపింది. నల్గొండ జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వేసవి వేడి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు, అకాల వర్షం కాస్తంత ఉపశమనాన్ని ఇచ్చింది. సుమారు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, అమ్మకానికి ఉంచిన వడ్లు తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

# వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్ కుమార్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. హన్మకొండ జిల్లా వాసి, మాదిగ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ సుధీర్ కుమార్ హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మన్ గా కొనసాగుతున్నారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీకి విధేయుడుగా, అధినేతతో కలిసిపనిచేస్తున్న సుధీర్ కుమార్ సరైన అభ్యర్థిగా ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ముఖ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు అందరితో చర్చించి వారి సలహా సూచనలమేరకు అధినేత కేసీఆర్, సుధీర్ కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రకటించారు. మే 13వ తేదీన తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ జరగబోయే ఎన్నికల నేపథ్యంలో మొత్తం 17 స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. మొత్తం 17 పార్లమెంట్ స్థానాల్లో ఐదు సీట్లు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించగా, మిగతా 12 సీట్లలో 6 సీట్లు బీసీ లకు కేటాయించారు. మిగతా 6 స్థానాలను ఓసీ లకు కేటాయించారు. మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని మహిళా అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితకు కేటాయించారు.

**మొత్తం బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ఇదే**

1. ఖమ్మం - నామా నాగేశ్వర్ రావు (ఓసీ).
2. మహబూబాబాద్ (ఎస్టీ) - మాలోత్ కవిత.
3. కరీంనగర్ - బోయినపల్లి వినోద్ కుమార్ (ఓసీ).
4. పెద్దపల్లి (ఎస్సీ) - కొప్పుల ఈశ్వర్.
5. మహబూబ్ నగర్ మన్నె శ్రీనివాస్ రెడ్డి (ఓసీ).
6. చేవెళ్ల - కాసాని జ్ఞానేశ్వర్ (బీసీ).
7. వరంగల్ (ఎస్సీ) - డాక్టర్ మారెపెల్లి సుధీర్ కుమార్.
8. నిజామాబాద్ - బాజి రెడ్డి గోవర్ధన్ (బీసీ).
9. జహీరాబాద్ - గాలి అనిల్ కుమార్ (బీసీ).
10. ఆదిలాబాద్ (ఎస్టీ) - ఆత్రం సక్కు (ఆదివాసీ).
11. మల్కాజ్ గిరి - రాగిడి లక్ష్మా రెడ్డి (ఓసీ).
12. మెదక్ - పీ వెంకట్రామి రెడ్డి (ఓసీ).
13. నాగర్ కర్నూల్ (ఎస్సీ) ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.
14. సికింద్రాబాద్ - తీగుళ్ల పద్మారావు గౌడ్ (బీసీ).
15. భువనగిరి - క్యామ మల్లేశ్ (బీసీ).
16. నల్గొండ - కంచర్ల కృష్ణారెడ్డి (ఓసీ).
17. హైదరాబాద్ - గడ్డం శ్రీనివాస్ యాదవ్



# మాదిగలకు తీవ్ర అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**



కాంగ్రెస్ పార్టీ మాదిగలను అణగదొక్కుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికల్లోకాంగ్రెస్ పార్టీ నుంచి మాదిగలు ఎందుకు ప్రాతినిధ్యం వహించటం లేదని ప్రశ్నించారు.
మోత్కుపల్లి నరసింహులుకు ఎందుకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు? బాబు జగ్జీవన్ రామ్ భవనం ప్రారంభోత్సవానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎందుకు ఆహ్వానించలేదని సూటిగా ప్రశ్నించారు. ఈ మూడింటికి కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ముస్లిం ఉన్నాడు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింగా కనీసం మంత్రి కూడా లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 10 ఏండ్లు రేవంత్ రెడ్డే సీఎంగా ఉంటాడన్న షబ్బీర్ అలీకి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఒక ముస్లిం అయ్యుండి మంత్రివర్గంలో నలుగురు రెడ్లకు అవకాశం ఇచ్చి ఒక ముస్లింకి అవకాశం ఇవ్వకపోతే అడిగేది పోయి ఇలా మాట్లాడటం ఏమిటన్నారు. షబ్బీర్ అలీ నువ్వు ప్రభుత్వ సలహాదారుడివి సలహాలు ఇవ్వు, పొగడకు అని సూచించారు.

# అసద్ ను గెలిపించాలని కాంగ్రెస్ ప్లాన్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ తో మజ్లిస్ ఒప్పందం
- రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలుచుకొనేది మేమే
- హామీల అమలులో కాంగ్రెస్ ఫెయిల్
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్





**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

లోక్‌సభ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ కాంగ్రెస్ నేతలు ఆందోళన, అభద్రతా భావానికి గురవుతున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రచారంలో అన్ని పార్టీల కంటే బీజేపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. రుణమాఫీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు.

"కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. అన్ని హామీలు, గ్యారంటీలు అటకెక్కించి లోక్‌సభ ఎన్నికలతో ముడి పెట్టడం వల్ల అనుమానాలు కలుగుతున్నాయి. ప్రజల దృష్టిని మరల్చేందుకు, సానుభూతి పొందేందుకు తనపై కుట్రలు పన్నుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీని హైదరాబాద్ ఎంపీగా గెలిపించాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారం కైవసం చేసుకుంటుంది. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ తో మజ్లిస్ రహస్య ఒప్పందం కుదుర్చుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనా భారాస నేతల్లో అహంకారం తగ్గలేదు. అవకాశవాద రాజకీయాలను ప్రజలు గ్రహించి తగిన బుద్ధి చెప్పాలి. భాజపా అభ్యర్థులను మార్చే ఆలోచన లేదు. త్వరలోనే కంటోన్మెంట్ అభ్యర్థిని ప్రకటిస్తాం.. ఉప ఎన్నికలో విజయం సాధిస్తాం" అని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.



## సీఎంలను మార్చే, తొలగించే పార్టీ కాంగ్రెస్

- పదేండ్లు రేవంతే సీఎం అని ప్రకటిస్తున్నారు
- గతంలో సీఎల్పీ.. బీఆర్ఎస్ లో విలీనమైంది
- ప్రస్తుతం బీఆర్ఎస్ఎల్పీ.. కాంగ్రెస్ లో విలీనమయ్యే పరిస్థితి ఉంది
- మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**

తరుచుగా ముఖ్యమంత్రులను మార్చడం, తొలగించడం వంటివి కాంగ్రెస్ లోనే ఎక్కువగా ఉంటాయని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు పదేండ్ల వరకు సీఎంగా రేవంత్ రెడ్డే ఉంటారని ప్రకటనలు చేస్తున్నారని, దీని వెనుకున్న ఉద్దేశ్యమేంటని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టూర్, లిక్కర్ స్కాం, కాళేశ్వరం స్కాం, ఫోన్ ట్యాపింగ్ కేసు తరువాత తెలంగాణలో మార్పులు కనిపిస్తున్నాయని, దేశంలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని తేలిపోయిందన్నారు. ప్రశాంత్ కిశోర్ లాంటి వ్యూహకర్తలు, సర్వేలు సైతం బీజేపీకే పట్టం కడుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా కూటమిలో ఎన్ని పార్టీలున్నాయో రేవంత్ రెడ్డి చెప్పాలని ప్రభాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, టీజేఎస్, వామపక్షాలు కలిసి లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నాయని, పది, ఒకటి, ఆరుగా సీట్లు పంచుకున్నాయని చురకలంటించారు. ఫోన్ ట్యాపింగ్ అంశం కాంగ్రెస్, బీఆర్ఎస్ ను కలిపి నడిపిస్తోందని విమర్శించారు. లిక్కర్ స్కాం.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య బంధాన్ని పెంచినట్టుగా కనిపిస్తోందని సెటైర్లు వేశారు. ఈ రెండు పార్టీల మధ్య ఎంఐఎం మధ్యవర్తిత్వం వహిస్తోందన్నారు. గతంలో సీఎల్పీ, బీఆర్ఎస్ లో విలీనమైందని, ప్రస్తుతం బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్ లో విలీనమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు.








# భారీగా నకిలీ కరెన్సీ పట్టివేత

- 6.62 లక్షలు స్వాధీనం చేసుకున్న ఎస్ఓటి పోలీసులు
- ఇద్దరి నిందితుల అరెస్టు
- మైలార్ దేవుపల్లి మెహఫిల్ హోటల్లో ముఠా అరెస్టు
- రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా బదులు చిల్డ్రన్స్ బ్యాంకు అని ముద్రణ
- మిగతాదంతా సేమ్ టూ సేమ్

**విశాలభారతి,హైదరాబాద్:**

ఎస్ఓటీ పోలీసులు భారీగా నకిలీ కరెన్సీని పట్టుకున్నారు. 6.62 లక్షల ఫేక్ కరెన్సీని వచ్చేందుకు యత్నిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుంగనూరు (చిత్తూరు) చెందిన వారిగా గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ ఎస్ ఓ టీ టీం, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలోని మెహఫిల్ రెస్టారెంట్‌లో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి పేర్లు గంగరాజు, అభినందన్ అని తెలిపారు. వారు చిత్తూరు జిల్లాకు చెందిన పుంగనూరు వాసులని గుర్తించారు. 500 రూపాయల నోట్ల కట్టలలో కింద మీద అసలు నోట్లు పెట్టి మధ్యలో నకిలీ నోట్లు పెట్టి మోసం చేస్తుంటారు. వారి వద్దనుండి 6.62 లక్షల విలువ చేసే 500 రూపాయల 10 కట్టలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గంగరాజు ప్రధాన నిందితుడు. గంగరాజు స్టాక్ బ్రోకరేజ్ బిజినెస్ చేస్తూ పెద్ద ఎత్తున డబ్బు పోగొట్టుకున్నాడు. అందుకే సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో 2 నెలల క్రితం మహారాష్ట్రకు చెందిన సచిన్ పవార్, సురేష్ పవార్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన నకిలీ కరెన్సీ వీడియో ను చూసి వారిని సంప్రదించాడు. వీడియో కాల్స్ కూడా చేశాడు. వారు నకిలీ 500 రూపాయల నోట్లను 1:5 నిష్పత్తిలో సరఫరా చేస్తారు. కొద్ది రోజుల క్రితం నిందితులు గంగరాజు, అభినందన్ మహారాష్ట్రలోని నందుర్‌బార్‌లోని ఛద్వేల్‌కు వెళ్లి సచిన్ పవార్, సురేష్ పవార్‌లను కలుసుకుని మార్కెట్‌లో పరీక్షించడానికి నమూనాగా 10 నకిలీ నోట్లను కొనుగోలు చేసి సికింద్రాబాద్ కు చేరుకుని ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన లక్కీ అనే వ్యక్తి కి 5 నోట్లు ఇచ్చి మార్కెట్లో మార్పిడి చేయించారు. దీంతో సులభంగానే మారుతున్నాయని గ్రహించారు. గంగరాజు 3.5 లక్షలు పోగు చేసుకుని ఇద్దరూ బెంగుళూరు, సూరత్, నందుర్ బార్ మీదుగా మహారాష్ట్రలోని ఛద్వేల్ అనే పట్టణానికి చేరుకుని సచిన్ పవార్, సురేష్ పవార్ ను కలిశారు. వీరు పెద్దఎత్తున నకిలీ నోట్లు ముద్రించి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఏజెంట్లను పెట్టుకుని వారి ద్వారా నకిలీ నోట్ల వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. వారి నుంచి 17 లక్షల నకిలీ నోట్లను తీసుకుని 3.5 లక్షలు (1:5 నిష్పత్తి) చెల్లించాడు. గంగరాజు పోలీసుల చెకింగ్స్ ఎక్కువగా ఉన్నాయనే భయంతో అక్కడే కొన్ని నకిలీ నోట్లు పారవేసి, బెంగుళూరుకు వెళ్లి తమిళనాడు లోని తిరువూరు కు చెందిన రవి అనే వ్యాపారికి నకిలీ నోట్లు ఇవ్వడానికి ప్రయత్నించారు. కానీ ఒప్పందం కుదరలేదు. అక్కడనుండి హైదరాబాద్ చేరుకుని సికింద్రాబాద్‌లోని లాడ్జిలో బస చేశారు. మల్కాజిగిరి లోని సాయిరాం థియేటర్ సమీపంలో తమకు తెలిసిన నరేష్ అనే వ్యక్తి సహాయం తో బైక్ అద్దెకు తీసుకున్నారు. గ్లామర్ బైక్ పై నకిలీ నోట్లను విక్రయించేందుకు మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలోని మెహఫిల్ రెస్టారెంట్‌కు చేరుకున్నారు. అత్యంత విశ్వాసనీయ సమాచారం విషయం తెలుకున్న ఎస్ ఓ టీ టీం, మైలార్‌దేవ్‌పల్లి పోలీసు బృందం వారిని పట్టుకున్నారు. 6.65 విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రజలకు, వ్యాపారులకు పోలీసుల సూచనలు నకిలీ 500 రూపాయల నోటు పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండవలసిన చోట చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించారు. నోట్లను తీసుకునే సమయంలో ఈ మార్పు ను గమనిచవల్సింది గా సూచన చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏంది మీరు చేసింది..?

- వ్యతిరేకిస్తే ఈడి, సిబిఐలతో దాడులు చేయిస్తుండ్రు
- రాముడి పేర అక్షింతలు, కుంకుమ పంచి ఓట్లు అడుగుతున్నారా?
- బిజెపి పార్టీ తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**



బీజేపీని వ్యతిరేకిస్తే ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను కేంద్ర దర్యాప్తు సంస్థలతో వేధించడం తప్ప బీజేపీ చేసింది ఏమైనా ఉందా అని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణకు బీజేపీ ఏమి ఒరగబెట్టిందని ఓట్లు అడుగుతుందని మంత్రి నిలదీశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా అవమానించారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజనను బీజేపీ వ్యతిరేకించిందని అన్నారు. అలాంటి పార్టీకి తెలంగాణలో ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని ప్రధాని మోదీని నిలదీశారు. విభజన చట్టంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేకపోయిందని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. ఒక్క విభజన హామీ కూడా నెరవేర్చనందుకు ఓటు వేయాలా? తెలంగాణకు ఏమి చేయనందుకు ఓటు వేయాలా? ఏడు మండలాలతో పాటు విద్యుత్ కేంద్రాలను ఆంధ్రకు అప్పజెప్పినందుకు ఓటు వేయాలా? అని మంత్రి పొన్నం నిలదీశారు.పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. చేనేత పరిశ్రమపై ఆధారపడిన కార్మికులకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. బీజేపీ దళితులకు, బీసీలకు, మైనారిటీలకు వ్యతిరేకమని విమర్శించారు. 'ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు' ఇస్తామన్న ప్రధాని మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ హయాంలో చేసింది ఏమిలేక కేవలం భావోద్వేగాలతో రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. అయోధ్య రాముడి పేరున అక్షింతలు, కుంకుమ ప్రజలకు పంచి ఓట్లు అడుగుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. కేంద్ర మంత్రిగా ఉండి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు ఏం చేశారని ప్రశ్నించారు. పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలపై ఈ నెల 14న కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో దీక్ష చేయనున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. బీజేపీ హయాంలో తెలంగాణకు చేసింది ఏమిటో బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాజ్యాంగాన్ని అంబేద్కర్ కూడా మార్చలేరు

**మొదటిపేజీ తరువాయి**

ఎవరి సూచనల మేరకు విపక్ష కూటమి పని చేస్తోందని కాంగ్రెస్‌ను ప్రశ్నించదలచుకున్నానని ప్రధాని మోదీ అన్నారు.రాజ్యాంగంలో మార్పులు చేయాలంటే పార్లమెంటులో భాజపాకు భారీ మెజార్టీ రావాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే ఇటీవల చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు మండి పడుతున్నాయి. అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం అని భాజపా సర్దిచెప్పుకునే ప్రయత్నం చేసినప్పటికీ రాహుల్ గాంధీ సహా విపక్ష నేతలు దీనినే ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌తో సహా విపక్షాల తీరుపై ప్రధాని మోదీ మరోసారి ప్రతిదాడికి దిగారు.

## దర్యాప్తు సంస్థలను మేము వాడుకోలేదు





లోక్‌సభలో బీజేపీ వరుసగా రెండు సార్లు సాధించిన మెజార్టీని తమ ప్రభుత్వం ఈ దేశాభివృద్ధి కోసమే ఉపయోగించిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. కానీ, అంతకుముందు కాంగ్రెస్ మాత్రం దశాబ్దాల పాటు తమకున్న మెజార్టీతో ఓ కుటుంబాన్ని బలోపేతం చేసిందని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ప్రతిపక్షాలకు కూడా తెలుసని ఎద్దేవా చేశారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందన్న విపక్షాల ఆరోపణలకు గట్టిగా బదులిచ్చారు. "అవినీతిపరులపై కఠిన చర్యలు చేపట్టేందుకు మా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోంది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ మా చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం రాజకీయ నాయకులనే దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని కొందరు కావాలనే తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు. ఈడీ దర్యాప్తు చేస్తున్న అవినీతి కేసుల్లో కేవలం 3శాతం వాటికే రాజకీయాలతో సంబంధముంది. మిగతా 97శాతం అవినీతి అధికారులు, నేరగాళ్లకు సంబంధించినవే' అని మోడీ వెల్లడించారు. 2014లో తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి నిర్మూలనకే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రధాని తెలిపారు. గ్రూప్ సీ, గ్రూప్ డీ ఉద్యోగాల్లో ఇంటర్వ్యూలను రద్దు చేయడం, లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు అందేలా నేషనల్ సింగిల్ విండో సిస్టమ్‌ను తీసుకురావడం దానిలో భాగమేనని గుర్తుచేశారు. ఈ చర్యలతో గత పదేళ్లలో దాదాపు 10 కోట్ల మంది నకిలీ లబ్ధిదారుల పేర్లను తొలగించినట్లు పేర్కొన్నారు. దీంతో రూ.22.75లక్షల కోట్లను తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడినట్లు తెలిపారు. 2014 ముందు ఈడీ అటాచ్ చేసుకున్న ఆస్తులు విలువ రూ.25వేల కోట్లుగా ఉండగా.. గత పదేళ్లలో ఆ మొత్తం రూ.లక్ష కోట్లకు పెరిగిందని మోదీ వెల్లడించారు. "పోలింగ్ ప్రారంభం కాకముందు నుంచే చాలా మంది ఈవీఎంలపై నిందలు వేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని విపక్షాలకూ తెలుసు. అందుకే చాలా మంది ప్రతిపక్ష నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు" అని మోదీ విమర్శలు గుప్పించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్


# త్రాగునీటిని పొదుపుగా వాడాలి

- మిషన్ భగీరథ పైప్ లైన్ రిపేర్.
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అన్ని చర్యలు
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్



**సూర్యాపేట, విశాలభారతి**: అవంతిపురం నుండి ఇమాంపేట ప్లాంట్ కు వచ్చే మిషన్ భగీరథ రా వాటర్ పంపింగ్ మెయిన్ ఎం ఎస్ 1200 ఎం ఎం పైపులైన్ గరిడేపల్లి వద్ద లీకేజీ కారణంగా 95 ఎం ఎల్ డి ఇమాంపేట నీటి శుద్ధి కేంద్రం ను తేదీ. 13/04/2024 సాయంత్రం నుండి షట్ డౌన్ తీసుకోవడం మరమ్మత్తులు చేయడం కొరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లాంట్ పరిధిలోని సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటీలు అలాగే సంబంధిత మండలాలైన చిలుకూరు లోని (19) గ్రామాలు, కోదాడ(24), అనంతగిరి(24), మునగాల(32), నడిగూడెం(17), పెన్ పహాడ్(52) అలాగే సూర్యాపేట పరిధిలోని 15 గ్రామీణ ఆవాసాలు లాల్య తండా, ఇమాంపేట, రూప్లా తండా, కేటీ అన్నారం, జంగలవారి గూడెం కాసరాబాద, వెదురవారి గూడెం, జాటోత్ తండా, కేసారం, రాముల తండా, మిట్ట గూడెం, ముత్యాలమ్మ గూడెం, టి కే పహాడ్, బిల్య తండా, రతన్ బోజ్య తండా , 4 విలీన ఆవాసాలు దాసాయి గూడెం, దున్నవారిగూడెం, కుప్పిరెడ్డిగూడెం, కుసుమ వారి గూడెం లకు మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. తదుపరి తేదీ 15/04/2024 సోమవారం ఉదయం పునరుద్ధరించబడుతుందని తెలిపారు.

# బిజెపికి ఎన్నికలలో బుద్ధి చెప్పాలి

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి



**కురవి, విశాలభారతి:** విపరీతంగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నిరుద్యోగితను నియంత్రించలేని సమర్థ బీజేపీ పాలకులకు ఈ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నన్ను సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. డోర్నకల్ మున్సిపల్ కేంద్రంలో జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనాన్ని వెలికి తీస్తా, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తా, నని ప్రగల్బాలు పలికి, బిజెపి గత పది సంవత్సరాలుగా మునుపెన్నడూ లేని విధంగా నిరుద్యోగితలో 27%తోరికార్డు నెలకొల్పి, ఆకలి, పేదరికం, ఆసమానతలు విపరీతంగా పెరగడానికి కారణమై కార్పొరేట్లకు దేశ సంపద కారు చౌకగా దోచిపెడుతూ నిత్యవసర వస్తువుల ధరలు అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న చోద్యం చూస్తున్న కేంద్ర బిజెపి పాలకులకు సార్వత్రిక ఎన్నికలలోసరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేస్తూ అణిచివేయడానికి రాజ్యాంగ సంస్థలైన ఈ డిసిబిఐ లను, ఆయా పార్టీల నాయకులను జైల్లో పెట్టడానికి ఉపయోగిస్తూ దేశంలో నేడు అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తుందని, రాజ్యాంగ మూల సూత్రాలకు విఘాతం కలిగించే కుయుక్తులు పన్నుతు మతతత్వ, విద్వేష పూరిత, విభజన,రాజకీయ విధానాలను బరితెగించి అమలు పరుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఓటుతో చరమగీతం పాడాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు కే ప్రబేష్ మండల కార్యదర్శి తురక రమేష్, జన్ను స్వామి

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన

# కానిస్టేబుల్ సస్పెన్షన్



**పాలకీడు, విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికలు సందర్బంగా ఎన్నికల నియమావాళి అమలులో ఉన్నది. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ కార్యక్రమలలో నాయకుల విందులో పాల్గొనకూడదు అని నిబంధన ఉన్న సూర్యాపేట జిల్లా పాలకీడు పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న విష్ణు అనే కానిస్టేబుల్ ఏప్రిల్ 8వ, తేదీన నేరేడుచర్ల మండలం కేంద్రంలో ప్రజా ప్రతినిధి పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబందించిన పిర్యాదును విచారణ జరిపి సంబంధిత కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా SP రాహుల్ హెగ్డే గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎంపిసి అమలులో ఉన్న సమయంలో సిబ్బంది రాజకీయ కార్యక్రమాల్లో రాజకీయ నాయకుల విందులో పాల్గొంటే చర్యలు తప్పవు అని హెచ్చరించారు.



# కొత్త వ్యక్తులను రానివ్వకూడదు

- సీఐ సతీష్ కుమార్

**మణుగూరు, విశాలభారతి:** గ్రామంలోకి కొత్త వ్యక్తులను అసాంఘిక శక్తులను రానివ్వకూడదనీ మణుగూరు సిఐ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన సిబ్బందితో కలిసి పగిడేరు పంచాయతీ పరిధిలోని విప్పల గుంపు వలస ఆదివాసి గ్రామంలో పర్యటించారు. గత నెల రోజులుగా తెలంగాణ సరిహద్దు ఛత్తీస్గఢ్ లో జరుగుతున్న మావోయిస్టు కార్యకలాపాలకు సంబంధించి ముందస్తు సమాచారం కోసం మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఉండటానికి ప్రతిరోజు గ్రామాలను సందర్శిస్తూ, ప్రజలతో మీటింగ్ ఏర్పాటు చేసి సాంఘిక శక్తులను, కొత్త వారిని గ్రామాల్లోకి రానీయకుండా చూసుకోవాలని ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. ఆ గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకుని ఎటువంటి సహాయం కావాలన్నా మణుగూరు పోలీసులని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ సతీష్ కుమార్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలుని వేగవంతం చేయాలి

**చిట్యాల, విశాలభారతి:** ధాన్యం కొనుగోలుని వేగవంతం చేయాలని డిసిఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. చిట్యాల పట్టణం భువనగిరి రోడ్డు లో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిసిఎస్ఓ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 370 సెంటర్ల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోల్లు జరుగుతున్నాయని ఇప్పటివరకు 8809 మంది రైతుల వద్ద నుంచి 63500 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు రవాణా చేయటం జరిగిందని సంబంధిత రైతుల ఖాతాల్లో 12 కోట్ల 66 లక్షల నేరుగా జమ చేయడం జరిగిందన్నారు.వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అలాగే ధాన్యం కుప్పలపై తార్పలిన్ లు కప్పి ఉంచాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రతిరోజు ట్యాగ్ చేసి మిల్లింగ్ కి పంపాలని కొనుగోలు వివరాలను ఓపీఎంఎస్ వెబ్ సైట్ లో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని,రైతులు సెంటర్ వద్దకు వస్తే వారికి మంచినీటి సదుపాయం మరియు ఎండకి తీవ్రత ఎక్కువ ఉన్నందువలన షెడ్డు, టెంట్లు ఏర్పాటు చేయాలని రైతులు సెంటర్ వద్దకు రాగానే వారి యొక్క పేరు నమోదు చేసుకొని సీనియార్టీ ప్రకారంగా వడ్లు కొనుగోలు చేయాలని సూచించారు. డి సి ఎస్ ఓ వెంట సివిల్ సప్లై ఆర్ ఐ లింగస్వామి, అధికారులు తదితరులు ఉన్నారు.



# అంబేద్కర్ జయంతి వేడుకలు జయప్రదం చేయండి

- తెలంగాణ దళిత సంక్షేమ సంఘం, బాలానగర్

**కూకట్ పల్లి, విశాలభారతి**: బాలానగర్ లో నిర్వహించబడు డా. బీఆర్ అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు అధిముల్లా రాము పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ భావాన్ లో అధ్యక్షులు అధిముల్లా రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశ కార్యక్రమంలో అంబేద్కర్ జన్మదినం పురస్కరించుకొని జయంతి వేడుకలను జయప్రదం చేయవలసిందిగా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు మాట్లాడుతూ, నవభారత నిర్మాత, ప్రపంచ మేధావి, భారతదేశ మొట్టమొదటి న్యాయ శాఖ మంత్రి, డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన ఘనత అంబేద్కర్ కె దక్కుతుందని అన్నారు. రిజర్వ్ బ్యాంక్ స్థాపనలో ప్రముఖ పాత్ర వ్యవహరించి భారతదేశ పరిపాలన దశాదిశా నిర్ణయించిన మేధావి అంబేద్కర్ అని కొనియాడారు. పంచాయతీ స్థాయి నుండి పార్లమెంటరీ స్థాయి వరకు పరిపాలన ఏవిధంగా జరిగాలి, అన్ని రకాల చట్టాలను రాజ్యాంగం లో పొందుపరిచాడు. భారత రాజ్యాంగం భారత పరిపాలన వ్యవస్థకు చుక్కాని లాంటిదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను ఘనంగా స్మరించుకొని ఆయనకు ఘన నివాళులు అర్పించి జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గీడిమెట్ల రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకే దీప్తి, గౌరవ అధ్యక్షుడు సుంకే రామన్, మీడియా కార్యదర్శి రవి స్టీవెన్సన్, చింత సత్యనారాయణ, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# బిజేపి ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా మూడ అన్వేష్ నాయక్

**దేవరుప్పుల, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ దేవరుప్పుల మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా మూడ అన్వేష్ నాయక్ ను మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అన్వేష్ నాయక్ మాట్లడుతూ నాపై నమ్మకంతో నాకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డికి మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్యకి అభినందనలు తెలిపారు.




# ఆరోగ్యం పై అవగాహన వారోత్సవాలు

**పటాన్ చెరు,విశాలభారతి:** ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో పటాన్ చెరు పరిసర గ్రామాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్యం పై అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఏషియన్ పెయింట్స్ సంస్థ సహకారంతో ఈ నెల 6 నుంచి 12 వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా , హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎల్లబోయిన సాంబరాజు మాట్లాడుతూ నా ఆరోగ్యం నా హక్కు అనే ప్రాధాన్య అంశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరానికి ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా అందరికీ ఆరోగ్యం అందుబాటులో ఉండటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. వ్యాధి చికిత్స కంటే ముందు వ్యాధి నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ వారం రోజుల పాటు ఆరోగ్యం పై అవగాహన వారోత్సవాలను శివనగర్, రాళ్లకత్వ, ఊట్ల, భానూర్, నందిగామ , వెలిమెల, రుద్రారం ఇంద్రకరణ్, ఇస్నాపూర్, ముత్తంగి, గౌతమ్ నగర్, బీరంగూడ, గొల్లబస్తీ, శాంతినగర్ కాలనీలలో నిర్వహించి దాదాపు 500 మందికి ఉచిత ఆరోగ్య సేవలను బిపి, షుగర్ పరీక్షలను చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ తోట అర్జున్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి ప్రజలకు తెలియజేశారు. తీసుకోవాలో తెలిపారు. సంస్థ ప్రతినిధులు ఎండి ఆయాజుద్దీన్, శ్రీకాంత్ పాటిల్, డాక్టర్ అర్జున్ పాల్గొన్నారు.



# మడికట్టులో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

- ప్రపంచమే గర్వించే స్థాయికి ఎదిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్
- రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేన భీం భరత్

**చేవెళ్ల, విశాలభారతి:** మండల పరిధిలోని మడికట్టు గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ మహనీయుల వారి విగ్రహాలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కే.యాదయ్య, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామేనా భీం భరత్, గాయకుడు, వక్త రెంజర్ల రాజేష్ లు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆర్థిక వేత్త తత్వవేత్త సామాజిక విప్లవకారుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కూర్చున్న తప్పు నిలుచున్న తప్పు గుడిలోకి రానివ్వని రోజులలో తాడిత పీడిత ప్రజలకు ధైర్యాన్నిస్తూ వారి కోసం పుట్టుకొచ్చిన మహాత్ముడు ప్రపంచ మేధావి భారతదేశ ముద్దుబిడ్డ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ,మరియు దళితుల ఆశాజ్యోతి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన స్వతంత్ర సమర యోధుడు, పార్లమెంటరీయన్ గా చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయిన నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబవాడ గ్రామంలో 1889 ఏప్రిల్ 14న రాంజీ సక్పాల్, భీమాబాయి దంపతులకు 14 వసంతానంగా జన్మించడం జరిగింది. అంబేద్కర్ తన చిన్నతనం నుండి అనేక రకాల అవమానాలను, అసమాన తలను ఎదుర్కొని ఎన్నో ఉన్నత చదువులు చదివి ప్రపంచ మేధావిగా ఎదిగి భారతదేశానికి తలతో సమానమైన భారత రాజ్యాంగ నిర్మాతగా గొప్ప పేరు సంపాదించుకొని బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం సమాన హక్కులు కల్పించిన మహనీయులు డాక్టర్ అంబేద్కర్ అని అన్నారు. అదేవిధంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కూడా దళిత ప్రజల గురించి తన జీవితాన్ని త్యాగం చేసి 1919లో ప్రాథమిక విద్య, 1920లో పాఠశాల విద్య పూర్తి చేసి, 19 26వ మెట్రిక్యులేషన్ పూర్తిచేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 1931లో కలకత్తా యూనివర్సిటీ నుంచి బీఎస్సీ పూర్తి చేసి పట్టా పొందారు. అన్ని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య పర్యావరణ నియంత్రణ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, దళిత రత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్, డిసిసి మాజీ చైర్మన్ వెంకటస్వామి, చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండారి ఆగి రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి , చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులున్నారు.



# ఉపాధి హామి పనులలో కనీస వసతులు కరువు

- ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి సక్రు

**గార్ల, విశాలభారతి:** మండలంలోని పెద్ద కిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో కనీస వసతులు కరువై ప్రజలు మండుతున్న ఎండలకు అల్లాడుతున్నారని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సక్రు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన, ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడు వారాలుగా చేసిన పనులకు ఇంకా డబ్బులు రాలేదని, అలాగే పని జరుగుతున్న ప్రదేశంలో కనీస వసతులు అయిన టెంటు,మంచినీరు, మెడికల్ కిట్లు వగైరా లేవని కూలీలు వాపోయారు. ఎండాకాలంలో ముమ్మరంగా జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కనీస వస్తువులు లేకపోవడం విచారకరమని, తక్షణం ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించి, వెంటనే వారు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని ఉపాధి హామీ అధికారులకు ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# న్యాయమూర్తికి పుష్పగుచం అందజేత

- వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసిన సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి

**భద్రాచలం, విశాలభారతి:** సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి తెలంగాణ దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి మండా వెంకటేశ్వరరావుని భద్రాచలంలోని వారి నివాసంలో పుష్పగుచ్చం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. న్యాయమూర్తి మండా వెంకటేశ్వరరావు భద్రాచలంలో ఎవరికి పరిచయం అవసరం లేని సుపరిచిత వ్యక్తి అని అంతేకాకుండా ఆయనకు చిన్నతనం నుంచి కూడా చదువు పట్ల ఎక్కువ శ్రద్ధ ఉండేది. ఎంతో కష్టపడి చదువుకొని న్యాయమూర్తిగా ఎదిగినందుకు భద్రాచల వాసులందరూ ఎంతగానో హర్షం వ్యక్తం చేస్తున్నారనీ ఆయన అన్నారు.



# విజయ సంకల్ప సమ్మేళనానికి తరలిన బీజేపీ శ్రేణులు

**తొర్రూరు, విశాలభారతి:** వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కాంక్షిస్తూ వరంగల్ లోని మడికొండ సత్యసాయి కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన వరంగల్ పార్లమెంట్ పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి తొర్రూరు మండలం నుండి బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళడం జరిగింది. స్థానిక అన్నారం రోడ్డు ఆర్చ్ వద్ద బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ జెండా ఊపి వాహనాలు ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మరోసారి అఖండ విజయం సాధించడం ఖాయమని, ముచ్చటగా మూడోసారి ప్రధాని నరేంద్ర మోడీ గారు ప్రదాని కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పార్లమెంటు అభ్యర్థి అరూరి రమేష్గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రదాని నరేంద్ర మోడీ గారికి కానుకగా అందించేందుకు బీజేపీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంటు ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఈసారి బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్థానికుడైన అరూరి రమేష్ గారిని గెలిపిస్తే మోడీ గారి సహకారంతో వరంగల్ పార్లమెంట్ సమగ్రాభివృద్ధికి క్రృషి చేస్తారని తెలిపారు. కేంద్రంలో 400 వందల సీట్లతో బీజేపీ మూడో సారి అఖండ విజయం సాధించడం ఖాయమని, తెలంగాణలో విశేషమైన స్పందన వస్తుందని ఈసారి 12సీట్లు గెలిచి చరిత్ర సృష్టించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఈకార్యక్రమంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, రూరల్ మండలం అద్యక్షుడు బొచ్చు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# భరత్ ప్రసాద్ గెలుపుకై ఇంటింటా ప్రచారం

**వనపర్తి విశాల భారతి::** బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి భరత్ ప్రసాద్ ను భారీ మెజార్టీతో గెలిపియడమే అంతిమ లక్ష్యమని వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి పల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో బిజెపి ఎంపీ అభ్యర్థి పోతుగంటి భారత్ ప్రసాద్ కి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ప్రచారంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ,సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ .. నాగర్ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి యువ నాయకుడు పోతుగంటి భరత్ ప్రసాద్ కు అందరూ మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందని ప్రధాన మంత్రిగా మూడవసారి నరేంద్ర మోడీ కి అవకాశం ఇవ్వాలంటే నాగర్ కర్నూలు నియోజకవర్గంలోని ప్రజలందరూ బిజెపి పార్టీకి మద్దతుగా నిలబడి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో భరత్ ప్రసాద్ ను గెలిపించాలని మోడీ ఆశీస్సులతో నాగర్ కర్నూలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ కన్వీనర్ విరాట్ బూత్ అధ్యక్షులు చరణ్ హరీష్ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చర్యలు

**నల్లగొండ, విశాలభారతి:** నామినేషన్ సమయంలో రాజకీయ పార్టీలు అభ్యర్థులు ఎవరైనా తప్పుడు అఫిడవిట్ ను సమర్పిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చందాన దీప్తి ఐపిఎస్ తెలిపారు.పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం రాజకీయ పార్టీలు అభ్యర్థులు మరియు ఎవరైనా తప్పుడు అఫిడవిట్ ను సమర్పించడం లేదా అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్ లో కొంత సమాచారాన్ని దాచిపెట్టి అఫిడవిట్ ను సమర్పించడం నేరం గా భావించడం జరుగుతుందని అన్నారు. నామినేషన్ పత్రాలు సమర్పించే ముందు సరియైన ఆధారాలతో అపిడివిట్ ను సమర్పించాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఐపిఎస్



సెక్షన్స్ 420, 468, 471, 120(బి), ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 (ఏ), ఇతర చట్టాల క్రింద కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.



# చేనేతల సమస్యలను పరిష్కరిస్తాం

**చిట్యాల, విశాలభారతి:** చేనేతల సమస్యలని పరిష్కరిస్తానని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు.చేనేత కార్మికుల బరోసా యాత్రలో బాగంగా చిట్యాల పట్టణంలోని ముప్ప మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి మాజీ ఎంపీ ప్రస్తుత బిజెపి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్య గౌడ్ హాజరై మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ హయంలోనే దేశంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రీయ విద్యాలయం,పాస్ పోర్ట్ ఆఫీస్, మల్కాపురంలో ఇండస్ట్రియల్ పార్క్,ఎయిమ్స్, వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశానని గుర్తుచేశారు. చేనేత సమస్యల కోసం ప్రధాని మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే బిజెపి ప్రభుత్వం చేనేతల సమస్యల గూర్చి పలు సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతల అభివృద్ధిని మర్చిపోయిందని అన్నారు.కేంద్రంలో మరోసారి బిజెపి ప్రభుత్వమే అధికారంలోకి రాబోతుందని ఈ ప్రాంత నేతన్నల సమస్యలని పార్లమెంట్ లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలోబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొగులయ్య, ఎస్సీ మోర్చా భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ మాస శ్రీనివాస్, మండల పట్టణ అధ్యక్షులు పొట్లపల్లి నరసింహ, గంజి గోవర్ధన్, నాయకులు జయారపు రామకృష్ణ, కన్నెబోయిన లింగస్వామి, గుండాల నరేష్, పల్లె వెంకన్న గోశిక వెంకన్న, పబ్బు వెంకన్న, బానుక ఉదయ్, పలువురు నేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- **మండల కాంగ్రెస్ నాయకులు పల్స సైదులు గౌడ్**

**సూర్యాపేట, విశాలభారతి:** ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన దాన్యంకు మద్దతు ధర అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు పల్స సైదులు గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామారం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ధళారులకు విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యం విక్రయించి రైతులు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్స కృష్ణ మూర్తి, డాక్టర్ మల్లేష్, గాజుల యల్లయ్య, ఉపేందర్, ముక్కాల శ్రీను, తీగల వెంకన్న, బోడ శ్రీను, మేకల దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్ర స్వామి దేవాలయ గోడ పత్రిక ఆవిష్కరణ

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవ కరపత్రిక మరియు గోడపత్రికను ఆవిష్కరణ కార్యక్రమం పురపాలక వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి మాజీ దేవాలయ కమిటీ అధ్యక్షుడు దాచేపల్లి ప్రకాష్, గార్ల చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిల్లమురళి, ధర్మకర్తలు, కామిశెట్టి చంద్ర శేఖర్ గుప్తా, గుర్రం వెంకటేశం, పోలోజు శ్రీలత శ్రీనివాస్ చారి, తూర్పాటి నరసింహం, గుజ్జుల సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







# ఎన్నికల ప్రచార రథాల ప్రారంభం

- **జెండా ఊపి రథాలను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ**
- **గణేష్ దేవాలయంలో నీలం మధు పూజలు**
- **పాల్గొన్న కాంగ్రెస్ నేతలు జగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంత్ రావు**

**పటాన్ చెరు,విశాలభారతి:**పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ప్రచార రథాల ప్రారంభోత్సవ కార్యక్రమం పటాన్ చెరు మండలం రుద్రారం గణేష్ గడ్డ దేవాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జీ కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి డిసిసి ప్రెసిడెంట్ నిర్మల, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావులతో కలిసి జెండా ఊపి ప్రచార వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి నీలం మధు గణేష్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకన్న, సభ్యులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, పీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి డిసిసి ప్రెసిడెంట్ నిర్మల, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, సన్నాయి మేళాలతో దేవస్థానంలోకి ఆహ్వానించారు. వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవస్థానం కమిటీ శాలువాలతో నేతలను సన్మానించారు.



# కుట్టుమిషన్ పంపిణీ చేసిన పళణి సేవాదళ్

**విశాల భారతి,వరంగల్ సిటీ:**
**వరంగల్ పట్టణం లోని పళణి సేవాదళ్ ఫౌండేషన్ సభ్యుడు పుల్లూరు మధు ఆరుగురు బీద మహిళలకు కుట్టుమిషన్ లను పంపిణీ చేశారు. ఈ కుట్టు మిషన్ ల పంపిణీ వలన మహిళలు స్వయం సంవృద్ధి సాధించవచ్చని ఫలణి సేవాదళ్ ఫౌండేషన్ అధ్యక్షులు బోడ్ల రవీంద్ర నాథ్ అన్నారు. అలాగే గత ఆరు సంవత్సరాలనుండి ఫలణి సేవాదళ్ ఆధ్వర్యంలో బాటసారులకు ప్రతి అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ఈ సంవత్సరం ఎండలు విపరీతంగా ఉండడంతో సభ్యులు అందరూ కలిసి చలి వేంద్రం ప్రారంభించామని అన్నారు. కార్యక్రమం లో పబ్బతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు**



# కాంగ్రెస్ ప్రచార రథాలు. కలిసివస్తుందని ధీమా

- **బండి రమేష్**

**విశాలభారతి,కూకట్ పల్లి:**
మల్కాజిగిరి పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీ పాగావేసేందుకు రంగం సిద్దం చేసింది. అందుకోసం ప్రచార రథాలనే అస్త్రాలను వినియోగిస్తుంది.కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ఉదృతం చేసింది. ఒకవైపు కరపత్రాల పంపిణీ,మరోవైపు ప్రజా సమూహాలను కలుస్తూ ప్రజల్లోకి వెల్లుతున్నారు.తాజాగా కూకట్ పల్లిలో ప్రచార రథాలను సిద్ధం చేయగా, కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థి సునీత మహేందర్ తో కలిసి కూకట్ పల్లి ఇన్చార్జ్ బండి రమేష్ ప్రారంభించారు.పట్నం సునీత రెడ్డిని భారీ మెజార్టీ తో గెలిపించాలని ఈ సందర్భంగా బండి రమేష్ ప్రజలను కోరారు.పట్నం మహేందర్ రెడ్డి గతంలో మంత్రిగా , సునీత మహేందర్ రెడ్డి జిల్లా పరిషత్తు చైర్మెన్ గా ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పోటీచేసిన రేవంత్ రెడ్డి విజయం సాధించారని స్పష్టం చేశారు. దేశంలోనే పెద్ద పార్లమెంట్ మల్కాజిగిరి కాంగెర్స్ పార్టీకి కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మల్కాజిగిరికి కలిసివస్తుందని పోటీలో నిలిచిన అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ , గాలి బాలాజీ ,సాధు ప్రతాప్ రెడ్డి ,మేకల మైకేల్, సంజీవరావు, గంధం రాజు, మోహన్ రెడ్డి, చున్ను పాషా , శివ చౌదరి, లక్ష్మయ్య, టోచర్, అనిల్, మహేందర్, అస్లాం ,మాధురి రాము , ప్రసన్నకుమార్, రజిత, జోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



# బ్లూ మార్చ్ ను జయప్రదం చేయండి

- **డాక్టర్ రామగల్ల సుందర్.**

సికింద్రాబాద్, విశాలభారతి:
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించే బ్లూ షర్ట్స్ బ్లూ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామగళ్ళ సుందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరవెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లూ షర్ట్స్ బ్లూ మార్చ్ కరపత్రలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రామగళ్ళ సుందర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకుందాం కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం అనే నినాదంతో అంబేద్కర్ వాదులు మరియు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు అందరూ ఏప్రిల్ 14న సాయంత్రం నాలుగు గంటలకు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి ట్యాంక్ బండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం వరకు అందరూ బ్లూ షర్ట్స్ ధరించి బ్లూ మార్చ్ లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోరెల్లి సురేష్ మాట్లాడుతూ. సబ్బండ వర్గాల గొంతుక BSF వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో చేపడుతున్న బ్లూ షర్ట్స్ బ్లూ మార్చ్ కార్యక్రమానికి తెలంగాణ అన్ని జిల్లాల నుంచి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజాస్వామ్యన్ని పరిరక్షించుకుందాం అనే నినాదంతో సబ్బండ వర్గాలు అయినా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మళ్లీ బిజెపి ప్రభుత్వం వస్తే భారత రాజ్యాంగం కనుమరుగవుతుందని అందుకు ఈ దేశం మూలవాసులైన సబ్బండ వర్గాలు గొంతెత్తి అంబేద్కర్ జయంతి నీ పురస్కరించుకొని నీలి కవాతు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ ఓయూ ఇన్చార్జి కల్వకుర్తి శ్రీశైలం, బిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, బిక్షం, ఆరె కంటి శ్రీకాంత్, మాదిగ జేఏసీ ఓయూ ఇన్చార్జ్ జోగు గణేష్,సీనియర్ రీసెర్చ్ స్కాలర్ ప్రభాకర్, రేవంత్,కర్ణాకర్, ప్రవీణ్, మోహన్, మధు , పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులు పెట్టవద్దు

- **ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం వ్యాపారుల బాధ్యత**
- **పిర్యాదులు వస్తె చర్యలు తప్పవు**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో ధాన్యం కొనుగోల్లు జరుగుతున్నందున రైతుల పట్ల ధాన్యం కొనుగోలు వ్యాపారులు సానుకూలంగా స్పందించాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి రైతుల పక్షానా నిలవాలని, ఇది రైతులకు కష్టానికి, వ్యవసాయానికి ఇచ్చే గౌరవం అని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ ధాన్యం వ్యాపారులను, మిల్లర్లను, కమీషన్ ఏజెంట్లను, కొనుగోలు కేంద్రాల ఏజెంట్లను కోరినారు. రైతుకు సరైన గౌరవం, మద్దతు ధర లభిస్తే వ్యవసాయం ఇంకా వృద్ధిగా ముందుకు సాగుతుంది అన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతును ధాన్యం కొనుగోలు పేరట దళారులు ఎవరైనా మోసం



చేస్తే అలాంటి వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఎస్పి హెచ్చరించారు. రైతుల నుండి పిర్యాదులు వస్తె చట్టపరమైన చర్యలు తప్పవని గుర్తు చేశారు. మోసాలకు పాల్పడే వారిని నమ్మవద్దు, గుర్తింపు లేని వారికి ధాన్యం అమ్మి ఆర్థికంగా నష్టపోవద్దు అని రైతులకు ఎస్పి విజ్ఞప్తి చేశారు.




# బీజేపీని ఓడించండి

- **సిపిఎం అభ్యర్థి MD జహంగీర్ నీ గెలిపించండి**
- **పైళ్ల ఆశయ్య సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు**

**చౌటుప్పల్, విశాలభారతి:** భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల్ని ఓడించి నిరంతరం ప్రజల కోసం పోరాడే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశం అంతటి అశోక్ గారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆశయ్య మాట్లాడుతూ దేశంలో ఒకవైపు మతోన్మాద విధానాలు, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి,ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై తీవ్రమైన భారాలు వేస్తున్న బిజెపికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ తీవ్రమైన కరువుతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని కాంగ్రెస్ కు కూడా ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. మొన్నటి వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పరిపాలించి ప్రజల నుండి దూరమైందని నేడు మళ్ళీ అధికారం నిలబెట్టుకోవడం కోసం మాయమాటలు చెబుతూ ముందుకు వస్తుందన్నారని వీరందరినీ ఓడించాలని నిరంతరం ప్రజా సమస్యలపై రైతులు, కార్మికులు,వ్యవసాయ కూలీల సమస్యలపై, నిరుద్యోగ సమస్యపై, పరిశ్రమల కాలుష్యంపై, మూసి జల కాలుష్యంపై, ధరల పెరుగుదలపై అనేక పోరాటాలు నడుపుతున్న సిపిఎంకు,సిపిఎం ఎంపీ అభ్యర్థి ఎండి జహంగీర్ గారికి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలపై పోరాడే వారు ఎంపీగా గెలవడం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందని అందుకే ప్రజలంతా ఒకసారి ఆలోచించి ఈ పార్లమెంటు ఎన్నికల్లో సిపిఎం కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



# కాంగ్రేస్ ని ఏ పార్టీ ఢీ కొనలేదు

- **ఎమ్మెల్యే సామేల్**
- **కాంగ్రేస్ లోకి భారీ చేరికలు**

**శాలిగౌరారం, విశాలభారతి:** రాబోయే రోజుల్లో కాంగ్రేస్ పార్టీని ఏ పార్టీ ఢీ కొనలేదని, ప్రధాని మోదీని ఈ ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన శాలిగౌరారం MPTC జోగు సైదమ్మశ్రీనివాస్, బీఆర్ ఎస్ నాయకులు నూక కిరణ్ కుమార్ ,తాజా మాజీ సర్పంచులు జటంగి శంకర్ (రామాంజపురం ), గౌర వీరయ్య (తిరుమలరాయిని గూడెం ),బండారు శంకర్(రామగిరి ), షేక్ ఖాషీంబి (జాలోనిగూడెం ) శ్రీరామదాస్ రాజు, షేక్ జహంగీర్,నూక కిషోర్, జమ్ము అశోక్ తో పాటు మరో వంద మంది వివిధ గ్రామాల నుంచి ఎమ్మెల్యే మందుల సామెల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథం లోకి తీసుక వెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, మండల పార్టీ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, చాడ సురేష్ రెడ్డి,చామల మహేందర్ రెడ్డి, నోముల జనార్దన్,బెల్లి వీరభద్రం, గూని వెంకటయ్య,వేముల గోపినాథ్ తదితరులు ఉన్నారు.

# ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో రీడింగ్ ఎక్కువ, పెట్రోల్ తక్కువ

**దేవరుప్పుల, విశాలభారతి:** సింగరాజుపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో పెట్రోల్ రాకముందే అమౌంట్ రీడింగ్ చూపిస్తుందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఓ కస్టమర్ కు అనుమానం వచ్చి చెక్ చేయగా ముందు రీడింగ్ వచ్చి కొద్ది సేపు తర్వాత పెట్రోల్ వచ్చింది.ఇలా బంక్ యాజమాన్యం ప్రజలను మోసం చేస్తున్నారని, సంబంధిత అధికారులు పట్టించుకోని సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు కోరారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
5
శనివారం,
13.04.2023
హైదరాబాద్



# విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

- **దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం**

**పటాన్ చెరు,విశాలభారతి:** ప్రతి మనిషి మానసిక ప్రశాంతత కోసం దైవభక్తిని పెంపొందించుకోవాలని,నియోజకవర్గంలోనూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం కర్ధనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ రేణుకా మాత, నాగులమ్మ విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పాండు, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ కుమార్, గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు బిఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ స్థాయి సమావేశం

- **హాజరుకానున్న మాజీ మంత్రి హరీష్ రావు**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్ చెరు,విశాలభారతి:** లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ మెదక్ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి మద్దతుగా శనివారం పటాన్ చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో సాయంత్రం నాలుగు గంటలకు పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేసినట్లు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో వెంకట్రాంరెడ్డి విజయానికి అనుసరించాల్సిన విధి విధానాలు, ప్రచారం తదితర అంశాలపై సమావేశంలో చర్చించునున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరు కాబోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



# కంటోన్మెంట్ లో గులాబీ నేతల మంతనాలు..

- **మాజీ మంత్రులు ఎమ్మెల్యేలతో అభ్యర్థి నివేధిత భేటీ**

**విశాలభారతి,సికింద్రాబాద్ కంటోన్మెంట్ :** కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం నేతలు కసరత్తు చేపట్టారు. సాయన్న వారసత్వాన్ని నిలబెట్టుకునేందుకు అభ్యర్థి నివేధిక మంతనాలు చేపట్టింది. స్థానిక బీఆర్ఎస్ నేతలను మర్యాధపూర్వకంగా కలిసి తన విజయంకోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజలతో కలిసి ఆత్మీయ సమావేశాలు నిర్వహించి నివేధిత తాజాగా మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డిని వారి నివాసంలో మర్యాధ పూర్వకంగా కలిసారు. ఇరువురి ఆశీర్వాధాలు తీసుకున్నారు. అనంతరం మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆయన్ని కలిసారు. అనంతరం నియోజికవర్గ బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ నేత శ్రీధర్ రెడ్డిని కలిసి పూలగుచ్చాలిచ్చి ,శాలువాతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా పెద్దల సమక్షంలో ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలతో కలిసి చర్చించారు. మరోవైపు సాయన్న అంటే స్థానిక ప్రజలకు ఎనలేని ప్రేమ ఉందని గుర్తు చేశారు..ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తున్న నివేధితకు ప్రజలు అండగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపఎన్నికల్లో ముమ్మరంగా ప్రచారం చేసి, భారీ మెజార్టీ సాధించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.సాయన్న కుటుంబానికి అండగా ఉండేందుకు యావత్ కంటోన్మెంట్ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భరిలో ఎన్ని పార్టీలు నిలిచినా.. ఢంకా బజాయించి గెలిచేది నివేదిత మాత్రమేనని గులాబీ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రవి నాయి, హేమంత్, ఉదయ్, ఉమేశ్, దీనానాథ్ యాదవ్, మురళి యాదవ్, ఆనంద్, పెంట శ్రీహరి, భాస్కర్ ముదిరాజ్, రాజు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# అనాధాశ్రమంలో పండ్లు పంపిణీ

**వనపర్తి విశాల భారతి::** జిల్లా కేంద్రంలోని చేయూత అనాధాశ్రమంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్ర సమీపంలోని చిట్యాల శివారులో గల చేయూత అనాధాశ్రమంలో గంధం శోభారాణి 7వ వర్ధంతిని పురస్కరించుకొని దివంగత గంధం చిన్న బాలయ్య కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ... సంఘసంస్కర్త గంధం చిన్న బాలయ్య అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం తోపాటు జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. అలాంటి మహానుభావునికి కూతురుగా జన్మించిన గంధం శోభారాణి ఉన్నత చదువులు చదివి అనుకోని పరిస్థితుల్లో స్వర్గస్తులవ్వడం అందరినీ కలిసిందన్నారు. ఆశ్రమంలోని చిన్నారులు ఉన్నత విలువలతో, మహనీయుల మార్గదర్శకాలతో ఉన్నత చదువులు చదివి సమాజానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కవి జనజ్వాల రాధాకృష్ణ, మాజీ జెడ్పిటిసి సభ్యుడు వెంకటస్వామి, ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి..నీలం మధు గెలవాలి

- **గడప గడపకు వెళ్ళండి..కాంగ్రెస్ పథకాలు ప్రచారం చేయండి**
- **మెదక్ ఇంచార్జీ మంత్రి కొండా సురేఖ**

**పటాన్ చెరు,విశాలభారతి:** గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథాలను పటాన్ చెరు మండలం రుద్రారం గణేష్ దేవస్థానం వద్ద మంత్రి కొండా సురేఖ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ...ఈ మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ ను కాంగ్రెస్ పార్టీ ఛాలెంజ్ గా తీసుకున్నదని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి ఈ మెదక్ సెగ్మెంట్ లో ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ సత్తాను చూపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరుగ్యారెంటీ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో నమ్మకంతో మెదక్ ఎంపీ అభ్యర్థిని గెలిపించే బాధ్యతను తనకు అప్పగించారని తెలిపారు. మెదక్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగి, అభ్యర్థి నీలం మధును గెలుపునకు కృషి చేయాలన్నారు. రేపటి నుండి ప్రచారం ముమ్మరం కానుందని, ఎన్నికలలో విజయకేతనం ఎగురవేసి, సంబురాలు జరుపుకునేందుకు సిద్ధంగా ఉండాలని మంత్రి సురేఖ కార్యకర్తలకు సూచించారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ..**
**- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

ఈ ఎంపీ ఎన్నికలలో మెదక్ పార్లమెంటు పరిధిలో బిఆర్ఎస్ కాంగ్రెస్ కు మధ్య పోటీ ఉంటుందని, ఇంకో పార్టీ పేరు కూడా తీయవద్దని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఎమోషన్లకు పోయి ఆ పార్టీ వ్యక్తిని గిల్ల వద్దని కార్యకర్తలకు సూచించారు. బీసీ బిడ్డ నీలం మధు ముదిరాజ్ కు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందని, అతని గెలుపు ఎంతో అవసరమని అన్నారు. ఇందుకోసం కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు.

**మెదక్ కాంగ్రెస్ అడ్డా**
**- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అడ్డా అని మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీకి అరుదైన అవకాశం దక్కిందని, మిగతా అభ్యర్థులు ఇద్దరు కూడా అగ్రవర్ణ కులాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. ఇందిరా ప్రాతినిధ్యం వహించినటువంటి ఈ మెదక్ సీటుపై కాంగ్రెస్ జెండా ఎగరేసేంతవరకు నిద్రపోయేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు టీఎస్ఐఐసి చైర్మన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, పటాన్ చెరు అసెంబ్లీ ఇంచార్జ శ్యామ్ గౌడ్, కాంగ్రెస్ నేతలు శశికళ యాదవ రెడ్డి, నరసింహారెడ్డి, ఎల్. సుధాకర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, గడ్డం శ్రీశైలం, వెంకన్న, అనిల్ రెడ్డి, శివానందం, పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గ ఇంచార్జీలు, జిల్లా కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, మునిసిపల్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# ధార్మిక పరిషత్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఫణిభూషణ్ చింతపల్లి



**మేడిపల్లి,విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరిషత్) తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్( ఐటీ సెల్ సోషల్ మీడియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ) గా ఫణిభూషణ్ చింతపల్లిని నియమిస్తూ కన్వీనర్ సూర్య ప్రకాష్ అన్నావజ్జుల నియామక పత్రాన్ని జారీ చేశారు. బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఫణి భూషణ్ మాట్లాడుతూ బిజెపి పార్టీ నుండి ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరిషత్) తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా తనకు బాధ్యతలు అప్పగించినందుకు ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరిషత్ ) రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణ నిబద్ధత చిత్తశుద్ధి అంకితభావంతో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు .



# మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, విశాల భారతి:** మైసిగండి మైసమ్మను శుక్రవారం అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి శాలువాలతో సత్కరించారు.



# వడ్లు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- **దళారులను నమ్మి మోసపోవద్దు**
- **పిఎసిఎస్ సీఈఓ చెల్మల మల్లారెడ్డి**

**సైదాపూర్, విశాల భారతి;** మండలంలోని వెన్నంపల్లి పిఎసిఎస్ పరిధిలోని వెన్నంపల్లి, ఆరేపల్లి, లస్మన్నపల్లి, సోమరం, ఎక్లాస్పూర్ గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను సిఈఓ మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర ఉంటుందని దళారులకు ధాన్యాన్ని విక్రయించి రైతులు మోసపోవద్దని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గడ్డం అబ్బయ్య సెంటర్ ఇన్చార్జీలు మహేష్,అనిల్ రెడ్డి,భాస్కర్ రెడ్డి ,రాజబాబు,కార్తీక్ రెడ్డి,సిబ్బంది సుశీల, వెంకటస్వామి, రమేష్,కాశపాక శ్రీనివాస్, కొమురెల్లి,బీరయ్య, సారయ్య, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కరెంటు నిలిపివేత

- **ఇంజనీర్ బొమ్మ ఆంజనేయులు గౌడ్**



**సైదాపూర్,విశాలా భారతి:** మండలంలోని ఆకునూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సైదాపూర్ సబ్స్టేషన్ పరిధిలో సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు విద్యుత్ మరమ్మతులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇంజనీర్ బొమ్మ ఆంజనేయులు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆకునూర్,సైదాపూర్ సబ్ స్టేషన్ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తి, విశాల భారతి:** కల్వకుర్తి మండలం జిలేళ్ళ గ్రామానికి చెందిన ఎముక రాములు (సత్తరు) అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృశ్య వారి కుటుంబానికి ముత్యాల రమేష్ ఆధ్వర్యంలో ఎముక జంగయ్య, పట్టపర్ల పాండు గౌడ్, చాంది ప్రశాంత్ రెడ్డి, కొమ్మ గోని సురేందర్ గౌడ్, చిక్కొండ ఆంజనేయులు, పాండు రంగ రెడ్డి, కొమ్మగోని కోదండ పని సహకారంతో మృతుని కుటుంబానికి శుక్రవారం రూ. 6వేలు ఆర్థికసాయం చేశారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, మాజీ ఉప సర్పంచ్ పాండు గౌడు, మాజీ వార్డు సభ్యులు పాండురంగ రెడ్డి, గుమ్మకొండ విష్ణు, కట్ట రమేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

# బాలరాముడికి మాజీ ఐఏఎస్ బంగారు రామాయణం కానుక

- **మాజీ ఐఏఎస్ అధికారికి కృతజ్ఞతలు**
- **మండ్ల దేవన్ననాయుడు**



**వనపర్తి విశాల భారతి::** అయోధ్య రాముడికి బంగారు రామాయణం కానుక.. భారతదేశానికి కూడిన రామాయణము హిందూ ధర్మము చరిత్రలో మహాపుణ్య కవి ఆదర్శ మూర్తి కోదండ రాముని చరిత్రను రాసిన మహర్షి వాల్మీకి అని తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయణంలో గ్రంథంలో 24000 శ్లోకాలతో కూడిన రామాయణము.. దీంట్లో 500 బంగారము పేజీలు, 10902 శ్లోకాలు ఉన్నాయి. అయోధ్య రామాలయానికి బంగారు రామాయణ గ్రంధాన్ని కానుకగా అందజేసిన మధ్యప్రదేశ్ కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ్ కు తెలంగాణ రాష్ట్ర వాల్మీకుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహర్షి వాల్మీకి జయంతిని జాతీయ పండుగ దినంగా ప్రకటించాలి అని అన్నారు. అలాగే రామాయణం గ్రంధాన్ని స్కూల్ పాఠ్యాంశంలో చేర్చాలి అని అన్నారు.



# బిజెపి ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రవి నాయక్

**వనపర్తి విశాల భారతి::** బిజెపి ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షునిగా కేతావత్ రవి నాయక్ ను నియమిస్తూ నియమక పత్రాన్ని అందజేశారు. బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ నియామక పత్రమును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలోని గిరిజన ప్రజల ఇబ్బందులను వారి అభివృద్ధి కోసమై పనిచేయాలని అదేవిధంగా భారతీయ జనతా పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ ను గెలుపు కోసం పనిచేసి మూడవసారి నరేంద్ర మోడీని ప్రధానమంత్రిగా పని చేసే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీశైలం, బచ్చురాం, తదితరులు పాల్గొన్నారు.

# అశ్రునయనాలతో గోమాత అంత్యక్రియలు



**గరిడేపల్లి, విశాలభారతి:** పోనుగోడు గ్రామములోని శివాలయంలో గ్రామం సుభిక్షంగా ఉండాలని కళ్యాణం చేసి ఊరి మీద వదిలిన గోమాత శుక్రవారం ప్రమాదశాత్తు బ్రిడ్జి మీద నుంచి అలుగులో పడి చనిపోయింది. తమ గ్రామం అంతా కలియతిరుగుతూ ఉండేదని, ఎవరినీ ఏమనేది కాదని మేమంతా పూజలు కూడా చేశామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇంతకాలం తమ గ్రామంలో ఉంటూ పూజలు అందుకున్న గోవును గ్రామస్తులందరూ కలిసి తమ అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.




## గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌కు గౌరవ డాక్టరేట్ అందిస్తున్న వేల్స్ యూనివర్సిటీ

అద్భుతమైన సినిమాలు చేస్తూ తనదైన ఇమేజ్‌ను సంపాదించుకున్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కీర్తి కిరీటంలో మరో డైమండ్ చేరింది. చెన్నైకు చెందిన ప్రముఖ వేల్స్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందిస్తోంది. దీంతో ఆయన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, స్టార్ డైరెక్టర్ శంకర్ వంటి వారి సరసన చేరారు. సినిమా దాన్ని మించిన ఆయన ప్రభావమే అందుకు కారణం. సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన మొదలు ఇప్పుడు గ్లోబల్ స్టార్ ఇమేజ్ వచ్చేంత వరకు ఆయన అంకిత భావంతో అసాధారణ ప్రతిభను చూపించారు. ఇటీవల రామ్‌చరణ్ నటించిన ఆర్ఆర్ఆర్ సినిమా సాధించిన విజయంతో రియల్ గేమ్ ఛేంజర్‌గా మారి గ్లోబల్ స్టార్ బిరుదుని సొంతం చేసుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట వ్యక్తులను గుర్తించి వారికి గౌరవ డాక్టరేట్స్ ఇవ్వటంలో వేల్స్ యూనివర్సిటీ ప్రసిద్ధి చెందింది. ఈ ఏడాదికిగానూ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఎంటర్‌ప్రెన్యూరర్‌గా రామ్ చరణ్ చేసిన సేవలకు వేల్స్ యూనిర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందచేస్తోంది. ఈ వేడుక ఏప్రిల్ 13న గ్రాండ్‌గా జరగనుంది. అందులో రామ్ చరణ్‌తో పాటు డా.పి.వీరముత్తువేల్ (ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చంద్రయాన్, ఇస్రో), డా.జి.ఎస్.కెవేలు (ఫౌండర్, సీఎండి ట్రివిట్రోన్ హెల్త్ కేర్), అచంట శరత్ కమల్ (పద్మశ్రీ అవార్డ్ గ్రహీత, ప్రముఖ టేబుల్ టెన్నిల్ ప్లేయర్)లను కూడా గౌరవించనున్నారు. తమ అభిమాన హీరోకు దక్కిన గౌరవంపై రామ్‌చరణ్ అభిమానులు ఎంతో సంతోషంగా ఉన్నారు. సోషల్ మీడియాలో అయితే ఈ వార్త తెగ వైరల్ అవుతుంది. చరణ్‌కు గౌరవ డాక్టరేట్ రావటంపై పలువురు ఎంతో గర్వంగా ఉందని మెసేజ్‌లు పెడుతున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే ఆయన చేయబోతున్న సినిమాలు ఆయన కెరీర్‌లో మరింత గొప్ప చిత్రాలుగా నిలుస్తాయి.



## 'గామి' మూవీని ZEE 5లో చూసి ఎంజాయ్ చేయండి : విశ్వక్ సేన్

విశ్వక్ సేన్, చాందినీ చౌదని హీరో హీరోయిన్లుగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'గామి'. కార్తిక్ శబరీష్ నిర్మాతగా వచ్చిన ఈ మూవీకి నరేష్ కుమరన్ సంగీతాన్ని అందించారు. మార్చి 8లో వచ్చిన ఈ చిత్రం ఏప్రిల్ 12 నుంచి జీ5 ఓటీటీ సంస్థలో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ స్నో కింగ్‌డమ్‌లో మీడియాతో ముచ్చటించింది. హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. 'ఇంత తక్కువ ఉష్ణోగ్రతలో ఇలా స్నో కింగ్‌డమ్‌లో నిర్వహించాలనే ఐడియా అంతా కూడా జీ5 టీందే. ఇలాంటి ఐడియా నాకు ఎందుకు రాలేదని అనుకుంటున్నాను. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని కూడా ఇలా చలిలోనే చేసేవాడ్ని. గామిలాంటి సినిమాలకు మామూలుగా అవార్డులు, ప్రశంసలు వస్తుంటాయి.. కలెక్షన్లు రావని అంతా అనుకుంటారు. కానీ ఇది నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఓపెనింగ్స్, కలెక్షన్లను సాధించింది. గామిలో కమర్షియల్ అంశాలేవీ ఉండవు. అయినా ఆడియెన్స్ చాలా బాగా ఆదరించారు. వారణాసిలోని ఘాట్‌లో శవాలు కాలుతున్నా కూడా ఓ 20 నిమిషాలు షూట్ చేశాం. చావుని వాళ్లు సెలెబ్రేట్ చేసుకున్నారు. అప్పుడు నాకు జీవితం చాలా చిన్నది అనిపించింది. ఇలాంటి కథను నమ్మాలి. నాకు పెద్ద రిస్క్ అనిపించలేదు. ఓ ఫ్లాప్ సినిమాను తీయడం కంటే.. ఇలాంటి కథను నమ్మడం బెటర్. గామిని థియేటర్లో అందరూ చూశారు. మాకు మంచి రివ్యూలు ఇచ్చారు. ఏప్రిల్ 12 నుంచి జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. ఓటీటీలోనూ మా చిత్రాన్ని చూడండి' అని అన్నారు. డైరెక్టర్ విద్యాధర్ మాట్లాడుతూ.. 'థియేటర్లో మా సినిమా కొంత మందికి అర్థం కాలేదు. ఇప్పుడు ఓటీటీలోకి వస్తోంది. మూడు నాలుగు సార్లు చూస్తే మా థీమ్ ఏంటి? మా కాన్సెప్ట్ ఏంటి? అన్నది అందరికీ ఈజీగా అర్థం అవుతుంది. మేం ఎప్పుడూ ఈ సినిమా కోసం లెక్కలు వేసుకోలేదు. చిన్నా, పెద్దా.. బడ్జెట్ అంటూ ఇలా లెక్కలేసుకుండా సినిమా తీశాం. జీ5లో ఏప్రిల్ 12 నుంచి మా స్ట్రీమింగ్ అవుతుంది. అందరూ వీక్షించండి' అని అన్నారు.



## బుట్ట బొమ్మకి మళ్లీ హ్యాండ్ ఇచ్చారా..?

నిన్న మొన్నటిదాకా సూపర్ ఫాం లో ఉన్న హీరోయిన్ సడెన్ గా ఒక్క ఆఫర్ కూడా లేక కెరీర్ డైలమాలో పడేలా చేసుకుంది. స్టార్ హీరోల సరసన ఫస్ట్ ఆప్షన్ తనే అనిపించుకున్న అమ్మడు కాస్త స్టార్ ఛాన్స్ కాదు కనీసం ఏ అవకాశం కూడా ఇవ్వలేనంతగా దూరమైంది. మొన్నటిదాకా చేతి నిండా సినిమాలతో అదరగొట్టిన అమ్మడు కాస్త ఇప్పుడు చేతిలో సినిమా లేక ఖాళీ అయ్యింది. లేటెస్ట్ గా ఒక సినిమా డిస్కషన్ స్టేజ్ లో ఉందని అనుకుంటుండగా ఇప్పుడు ఆ ఛాన్స్ కూడా వేరే హీరోయిన్ కు దక్కిందని తెలుస్తుంది. టాలీవుడ్ లో అన్ లక్కీ టైం కొనసాగిస్తున్న హీరోయిన్ గా బుట్ట బొమ్మ పేరు వినిపిస్తుంది. దువ్వాడ జగన్నాథం ముందు రెండు సినిమాలు చేసినా అమ్మడు వాటితో సక్సెస్ అందుకోలేదు. డీజేతో అమ్మడు ఆడియన్స్ మనసులు గెలిచింది. ఇక అప్పటి నుంచి వరుస స్టార్ సినిమాలతో దూసుకెళ్లింది. యాక్టింగ్ పరంగా సోసోగానే అనిపించినా గ్లామర్ షోలో ఫస్ట్ క్లాస్ మార్కులు కొట్టేసిన పూజా హెగ్దే టాలీవుడ్ లో టాప్ ప్లేస్ దక్కించుకుంది. అయితే సడెన్ గా వరుస ఫ్లాపులు ఆమె గ్రాఫ్ పడిపోయేలా చేసింది. సినిమాలు ఆడకపోవడంతో ఆమెకు ఛాన్సులు కూడా కరువయ్యాయి. మహేష్ గుంటూరు కారం నుంచి తప్పకోవడం ఆమెను మరింత రిస్క్ లో పడేసింది. అయితే న్యాచురల్ స్టార్ నాని హీరోగా సుజిత్ డైరెక్షన్ లో చేయబోయే సినిమాలో పూజా హెగ్దే నటిస్తుందని టాక్ వినిపించింది. అయితే పూజాని అనుకున్నారో లేదో కానీ ఇప్పుడు ఆమె ప్లేస్ లో మిస్టర్ బచ్చన్ హీరోయిన్ భాగ్య శ్రీ బోర్స్ ని హీరోయిన్ గా ఫిక్స్ చేస్తున్నారట. పూజా హెగ్దే దాదాపు ఫిక్స్ అనుకుంటున్న ఈ ఒక్క ఆఫర్ కూడా ఆమె చేతి నుంచి జారిపోయింది. సో టాలీవుడ్ లో పూజా బ్యాడ్ టైం ఇంకా కొనసాగుతూనే ఉంది. రవితేజ, నాని ఇలా టైర్ 2 హీరోల సినిమాల్లో కూడా పూజాని తీసుకునేందుకు ఆసక్తి చూపించట్లేదు. అందుకే బాలీవుడ్ వైపే ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తుంది పూజా హెగ్దే. నాగ చైతన్య హీరోగా చేస్తున్న నెక్స్ట్ సినిమాలో పూజా బేబికి ఛాన్స్ ఇస్తున్నారని టాక్ నడుస్తుంది. చైతు సినిమా ఒక లైలా కోసం సినిమాతోనే తెలుగు తెరకు పరిచయమైన పూజా హెగ్దే ఈ టఫ్ టైం లో మళ్లీ రెండోసారి కూడా చైతన్య సినిమా తోనే రాబోతుంది. మరి ఈ ఛాన్స్ అమ్మడికి మరిన్ని అవకాశాలు వచ్చేలా చేస్తుందా లేదా అన్నది చూడాలి.

## సుమ లాంచ్ చేసిన 'పారిజాత పర్వం' ట్రైలర్

చైతన్య రావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలలో వనమాలి క్రియేషన్స్ బ్యానర్ పై సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్న హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పారిజాత పర్వం'. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది తాజాగా మేకర్స్ ట్రైలర్ తో ముందుకు వచ్చారు. స్టార్ యాంకర్ సుమ కనకాల ట్రైలర్ ని లాంచ్ చేశారు. ''కేక్ కట్ చేసేటప్పుడు లైట్స్ అర్పుతారట, మళ్ళీ లైట్స్ వేసేలోపు కేక్ తో పాటు వాళ్ళ ఆవిడ కూడా మన బండిలో వుండాలి' అంటూ కిడ్నాప్ ప్లాన్ ని సునీల్ తన గ్యాంగ్ తో చెబుతుండగా మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. 'కిడ్నాప్ ఈజ్ ఎన్ ఆర్ట్'అనే ట్యాగ్ లైన్ ని జస్టిఫై చేస్తూ ఇందులో చూపించిన సన్నివేశాలు హిలేరియస్ గా వున్నాయి. చైతన్య రావు, సునీల్, శ్రద్ధా దాస్.. ఇలా సినిమాలోని ప్రధాన పాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ సీక్వెన్స్ లు హైలెట్ గా ఉంటూ కథపై చాలా క్యురియాసిటీని పెంచాయి. యాక్షన్, కిడ్నాప్ డ్రామా, ఫన్ ఇలా అన్నీ ఎలిమెంట్స్ తో ట్రైలర్ అలరించింది. ట్రైలర్ చివర్లో వైవా హర్ష చెప్పిన సినిమా రివ్యూ హిలేరియస్ గా వుంది. చైతన్య రావు, సునీల్, శ్రద్ధా దాస్ అందరూ తమ ఫెర్ఫార్మెన్స్ తో కట్టిపడేశారు. దర్శకుడు సంతోష్ కంభంపాటి హిలేరియస్ కిడ్నాప్ డ్రామాని ప్రేక్షకులకు అందించబోతున్నారని ట్రైలర్ చూస్తే అర్థమౌతుంది. ట్రైలర్ లో వినిపించిన పాట, నేపథ్య సంగీతం క్యాచిగా ఉంటూ ఫన్ ని మరింతగా ఎలివేట్. బాల సరస్వతి కెమరామెన్ పనితనం ఆకట్టుకుంది. విజువల్స్, నిర్మాణ విలువలు ఉన్నతంగా వున్నాయి. మొత్తానికి ట్రైలర్ సినిమాపై ఆసక్తిని మరింతగా పెంచింది.





## సత్యదేవ్ 'కృష్ణమ్మ' నుంచి సెలబ్రేషన్ సాంగ్ రిలీజ్

సత్యదేవ్.. హీరోగా, వెర్సటైల్ యాక్టర్‌గా తనకుంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు. పక్కా కమర్షియల్ సినిమా అయినా, ఎక్స్ పెరిమెంటల్ మూవీ అయినా సత్యదేవ్ తనదైన యాక్టింగ్‌తో అలరిస్తుంటారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా, ఒక్కో మెట్టూ ఎక్కుతూ తానేంటో ప్రూవ్ చేసుకుంటున్నారు హీరో సత్యదేవ్. ఆయన నటించిన లేటెస్ట్ సినిమా 'కృష్ణమ్మ'. రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం మే 3న గ్రాండ్ రిలీజ్ అవుతుంది. వి.వి.గోపాలకృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ పతాకంపై కృష్ణ కొమ్మలపాటి ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'కృష్ణమ్మ' మూవీ టీజర్, టైటిల్ సాంగ్, ఏమవుతుందో మనలో.. అనే లిరికల్ సాంగ్‌స్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం ఈ సినిమా నుంచి 'దుర్గమ్మ..' అనే సెలబ్రేషన్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. కాలభైరవ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా సాకేత్ కొమండూరి పాడారు. నవరాత్రుల సమయంలో దుర్గమ్మ ముందు హీరో సంతోషంగా ఆడిపాడే సందర్భంలో ఈ పాట వస్తుందని అర్థమవుతుంది.

## మూకీ చిత్రం 'కావ్య రాజ్ ' ట్రైలర్



గజగౌని ప్రొడక్షన్ పతాకంపై, కవిత రాజ్ పుత్, జమున, అంజలి,మధు, హీరో హీరోయిన్లుగా,మధులింగాల దర్శకత్వంలో, నిర్మాత గజ గౌని దయానంద్ గౌడ్ నిర్మిస్తున్న, యాక్షన్ ఎంటర్టైనర్, "కావ్య రాజ్" . ఈ చిత్రం ఇటీవల "ట్రైలర్ "లాంచ్ చేయడం జరిగింది. ముఖ్య అతిథి ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రెటరీ ప్రసన్న కుమార్ గారు విచ్చేసి చిత్ర ట్రైలర్ ను ఆవిష్కరించారు . ఇంకా ఈ కార్యక్రమంలో రావణ లంక హీరో క్రిష్, కోరియో గ్రాఫర్ కట్ల రాజేంద్ర ప్రసాద్, మధుకర్ రెడ్డి, చైల్డ్ ఆర్టిస్ట్ గజగౌని శివాంశ్ గౌడ్ , కంచర్ల లక్ష్మి కాత్యాయిని, శ్రీ భరణి, మల్లికార్జున్ గౌడ్ , పి అర్ ఓ వీరబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత దయానంద్ గారు మాట్లాడుతూ"ఈ సినిమా మామూలు సినిమా కాదు. తెలంగాణ మొట్టమొదటి మూకీ చిత్రం. ఈ చిత్రాన్ని పైడి జయరాజు గారికి అంకితం ఇస్తున్నాం. ఎందుకంటే భారత సినీ రంగంలో, తెలంగాణ కరీంనగర్ కు చెందిన తెలంగాణ నటుడు,నిర్మాత, దర్శకుడు,దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత,తెలంగాణ రాష్ట్రం నుండి హిందీ చిత్ర పరిశ్రమను ఏలిన సూపర్ స్టార్ మూవీ మొఘల్, అయినటువంటి పైడి జయరాజు గారికి సరైనటువంటి గౌరవం దక్కలేదని నేను చింతిస్తూ, ఈ సినిమాను పైడి జయరాజు గారికి అంకితం ఇస్తున్నాను. దాదాపుగా 300 చిత్రాలకు పైగా నటించి భారతీయ సినిమా పరిశ్రమలో. శిఖర సామాన్యుడిగా నిలిచి. తెలంగాణ నేల నుంచి దేశం గర్వించదగ్గ స్థాయిలోకి ఎదిగిన పైడి జయరాజ్ గారిని, ఈ విధంగా సత్కరించుకోవడం అనేది నాకు గర్వకారణం. ఈ విధంగానైనా. పైడి జయరాజు గారు అందరికీ తెలుస్తారని. చిన్న ఆశతో ఈ సినిమాని, తొలి తరం మహానటుడు,మూవీ మొఘల్, పైడి జయరాజు గారికి. అంకితం ఇవ్వడం జరిగింది. అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.